

# చలిలో చిన్నవాడు

## కె వి రా

ఏమీ తోచని వాడి మనస్సులో ఆలోచనల్లా – నక్షత్రాలు ఆకాశం నిండా చెదురుగా మెరుస్తున్నప్పుడు, భూమ్మీద సముద్రంలో కెరటాలు ఎగిరి పడుతున్నప్పుడు, ఏమీ తోచక బాల్కనీ పిట్టగోడమీద కూర్చుని దగ్గర్లో వున్న సముద్రంకేసి, దూరంగా వున్న ఆకాశంకేసి కళ్ళు చురుగ్గా తిప్పుతున్న బాల రాజు యౌవనం వయస్సు చలిలో ఒక్క పెట్టున గజగజ వణికి పోయింది; కోరికల మంచు కురిసి తడిసిపోయింది.

ఒక్కసారి సముద్రపుగాలి వడిగా వీచింది. మనస్సుతోపాటు వొళ్ళుకూడా చలిలో వణికింది. హృదయానికి వేడిపుట్టి మళ్ళీ తారామతి గుర్తుకొచ్చింది. ఇలా రెండు రోజులుగా గుర్తుకొస్తోంది బాల రాజుకు తారామతి. ఎందుకు?– అని అతను ప్రశ్న వేసుకోలేదు. కారణం అతనికి తెలుసు.

హాస్టల్లో తిండి పడక ఊళ్ళో సముద్రం వొడ్డున మేడమీద గదిలో రెండు రోజుల క్రితం అద్దెకుప్రవేశించాడు– యూనివర్సిటీలో "ఎమ్మెస్సీ" చదువుతున్న బాలరాజు. ఎదిగే వయస్సులో వున్న బాలరాజు అందంగా వుంటాడు. ఎప్పుడూ నుదుటిమీద చెదిరి పడుతున్న జుత్తు, చురుగ్గా చూసే కళ్ళు 'కారీగ్రాంట్'ని గుర్తుచేస్తాయి. బాలరాజు



ముఖం ఆడముఖం. ఒకసారి అతను 'అయ్యో! నాది ఆడమొహం!' అని విచారించబోగా అతని అంతరాత్మ 'నీ మొహం' అంది కోపంగా. అందుకే బాలరాజు ముఖ విషయంలో ఎప్పుడూ విచారించడు.

ఎప్పుడూహుషారుగా వుండే బాలరాజుని ఇప్పుడు ఒక విచిత్రమైనబాధ బాధిస్తోంది. అతడిమనస్సుమీద వగతీర్చు కొంటోంది. అతని వయస్సు ఇరవైఏళ్ళు నిండి, మనస్సు పాతికేళ్లుపెరిగినా– పదహారేళ్ళకుర్రవాడిలా లేతబాలరాజులా కనిపిస్తాడు వయసొచ్చిన బాలరాజు– అలా కనిపించినందుకు అతనేమీ విచారించడు. కాని లేచింది మొదలు ప్రతీ వ్యక్తీ, ప్రతీ సంఘటనా, ప్రతీ విషయం ప్రతీక్షణం అతన్ని చిన్నవాడిగా పరిగ ణిస్తాయి. పదహారేళ్ళ బాలాకుమారుడిలా ఎంచి కాలాన్ని వెనక్కి నెట్టేసి అతనికి లేని చిన్నతన్నాన్ని అంట గడతాయి. అందుకే తను సిగరెట్టు కాల్చేవాడయినా నలుగురితో నిర్భయంగాకాల్చలేడు. అతనికి ప్రేమించాలని వున్నా నలుగురిలో ప్రేమను గురించి స్వేచ్ఛగా మాట్లాడలేడు. మాట్లాడుదామనుకున్నా అతని లేతముఖం లేతగా కనిపించి అతని చిన్నతనాన్ని నలుగురికీ గుర్తుచేసి మాట్లాడనీయదు. అతన్ని ఇరవైయ్యేళ్ళ యువకుడిగా నలుగురితో మసలనివ్వదు. సాయంత్రం జరిగిన సంఘటన యిప్పుడా బాధని మరింత పిక్కటవేసింది. తన పుట్టిన రోజువండగ విందులో అందరికీ సిగరెట్లు యిచ్చి తనకి స్వీట్సు యిచ్చిన మిత్రుడు శేఖరాన్ని తల్చు కుంటే కోపం వస్తోంది. సిగరెట్టు ఇవ్వ నందుకు బాలరాజు బాధపడలేదు. కాని అలా



చెయ్యడంద్వారా తనకు తన ముఖం అంట గట్టిన చిన్నతనాన్ని అందరి యెదటా ప్రద ర్శించడమే అయింది. అందుకే బాలరాజు బాధ.

తనకీ వయస్సు వచ్చింది. తనకీ మనస్సు పెరిగింది. చలివేసినప్పుడల్లా తనకీ వేడి కోరికలు పుడుతున్నాయి. ఎవర్నేనా ప్రేమిస్తే బాగుండును అని తనకీ అని పిస్తోంది. కాని మధ్యలో ఈ 'చిన్నతనపు బాధ' వచ్చిపడింది. ఈ బాధ బాధలా వుండదు. మనస్సుని కొరుక్కుతింటోంది. హృదయాన్ని రంపపుకోత కోస్తోంది. తనను ఎవ్వరిచేతా ప్రేమించబడనీయదు. అందమైన ఈడైన ఆడపిల్లలచేత 'పరాయి మగాడి'గా గుర్తింపబడనీయదు. కోరికల్ని పెంచడమే దీనిపని. ఇలాగే క్రమంగా మనస్సు ముసిలిదైపోతే?– అమ్మో!– ఇంకేమన్నా వుందా?

చివరిదమ్ములాగి సిగరెట్టు పారేసి, ఇరవై ఏళ్ళ వయస్సు, పాతికేళ్ళ మనస్సు గల బాలరాజు తలపైకెత్తి ఆకాశం వైపు చూశాడు. పున్నమి వెళ్ళి నాలుగు రోజులైంది. పున్నమితోపాటు చల్లటి చలి, వేడి వెన్నెల కూడా నిరుపయోగమై వెళ్ళి పోయాయి. ఇప్పుడు ఆకాశం మధ్య వొంటరి చంద్రుడు చేతకాని వాడు చేసిన చపాతీలా వున్నాడు. నక్షత్రాలు ఉండుండీ మెరుస్తూ, చంద్రుణ్ని చూసి చిన్నబుచ్చు కుంటున్నట్లున్నాయి.

బాధపడినబాలరాజు, మనస్సులో లెక్క వేసుకున్నాడు.

ప్రేమించే దాకా మనస్సు ఊరుకోదు. ప్రేమిస్తే గాని పెద్దవాడిగా గుర్తింపబడటం

కష్టం. కాబట్టి ప్రేమించాలి. చూడగా ప్రేమే శరణ్యంగా కనిపిస్తోంది.

అలా కనిపించగానే అతని వయస్సు స్త్రీని గురించి ఆలోచించింది. అతని మనస్సు ప్రేమను గురించి ఆలోచించింది. మగాడు కోరికతో ప్రేమని ప్రారంభించి ప్రేమతో ప్రారంభించా ననుకుంటా డన్న సంగతి ఒకటి ఇప్పుడూ బాలరాజుకి విదితమైంది. అవును. ప్రేమజన్మస్థానం కోరిక. కోరిక జన్మస్థానం స్త్రీ.

ఇంటిముందు కారాగిన శబ్దమైంది. సముద్రంమీది దృష్టి యింటిముందు కారుమీదికి మళ్ళింది. కారులోంచి దిగింది - తారామతి. మనస్సులో పెద్ద ఆలోచన. తల వొంచకుండా ఠీవిగా నడుస్తూ లోపలకి వెళ్ళింది. వొయ్యారం మరిచిపోయినట్టు. ఎందుకో, ఠీవి ఆడవాళ్ళలో బాగుండదు. తారామతి అంతా బాగుంటుంది. ఒక్క నడకే - హంసలా నడవకూడదూ?- హంస నడక తెలియదేమో! పోనీ - గుర్రం పిల్లలా నడిచినా బాగుణ్ణు. తన ప్రేమ సఫలమయితే ముందు నడక నేర్పాలి. విచిత్రం! రెండురోజుల క్రితం పరిచయం మనస్సు నిండా యెంత పెద్ద ఆలోచనగా వ్యాపించి పోయింది!

వచ్చిన రోజునే ఇంటాయన పరిచయం చేశాడు - మెడిసిన్ చదివే తారామతిని. ఆమె బాబాయట. తన తండ్రికి బాల్య స్నేహితుడుట. ఆమె తల్లీ తండ్రీ మరో వూళ్ళో వుంటున్నారుట. ప్రస్తుతం ఈయన దగ్గిరే పెరుగుతోందిట. ఆయన చాలా నెమ్మది. ఎక్కువగా ఏమీ పట్టించుకోడు. మాట్లాడడు. మంచిమనిషి. ముఖ్యంగా తారామతి పరిచయం.



ఆమె లోపలికి వెళుతూ మొక్కలమధ్య నిలబడి క్షణం ఆగి మరీ వెళ్ళింది. ఆమె ఆగి నిలిచినచోటు చూశాడు. పవిత్రంగా - వెలితిగా వుంది. పక్కగా కుండీలో ఎండిన ఫెరన్ మొక్క. విరిసిన జాజులమధ్య కనకాంబరాలమధ్య. ఎర్రటి గులాబీల మధ్య - వొంటరిగా. దిగులుగా యెండిన ఫెరన్ మొక్క - తారామతి వదిలిన చోటు వద్ద క్రుంగి వుంది.

వేడికలల మధ్య చలిగాలిలో కొత్త మేడమీద బాలరాజు వొళ్ళు మరచి నిద్ర పోయాడు.

● ● ●

ఎవరో తన్ను లేపుతున్నారు. చల్లటి చేతులు - చల్లగా. మంచికల. మంచినిద్ర పాడు చేస్తున్నారు. చేశారు. కంటి మసకలో పల్చటి చీరలో. పల్చటి జాకెట్టులో పల్చటి మనిషి - పెదాలమీద పల్చటినవ్వు. కులూ లోయలో విరిసిన తెల్ల కలువ పువ్వులా వుంది - తారామతి. చటుక్కున లేచాడు బాలరాజు. క్షణం సిగ్గు పడ్డాడు.

"ఎక్కువసేపు నిద్రపోవడం ఆరోగ్యానికి మంచిదికాదు.

"మీరు మెడిసిన్ ఎన్నో సంవత్సరం!"

ఆమె వినలేదు. "లేచి త్వరగా స్నానం చెయ్యండి ఎనిమిదయితే కుళాయి కట్టేస్తారు. నీళ్ళుండవు."

"మీకు మేలుకొలపడం బాగానేవచ్చు."

"మీ నిద్రతో నాకు పనిలేదు. ఇంట్లో సోమరితనంవుంటే బాబాయి పట్టించుకోక పోయినా నేనుమాత్రం సహించలేను. లేచి వేగిరం స్నానం చెయ్యండి." అని క్రిందికి వెళ్ళింది.





తారామతిలో ఈచొఱవ బాగుంటుంది అనుకొని బాత్రూమ్‌లోకి నడిచాడుబాలరాజు.

గదిలోకి వచ్చిన బాలరాజు చకితుడయాడు. తను యెన్నో కథలు చదివాడు. చరిత్రలు చదివాడు. ప్రాచీన ప్రబంధాలు పఠించాడు. వాటిలో యెక్కడా ఏ కథానాయికకీ ఈ అందం కూర్చబడలేదు. ఏమైనా కల్పన సహజాన్ని అనుకరించలేదు. అందంగా, అందానికి నిర్వచనంలా, తెల్ల చీరలో, నల్ల జాకెట్టుతో దేవతలా - తారామతి. చేతిలో మదిర నింపిన చషకం. కంటి ముందు మసకపోయి మత్తుపేరుకుంటోంది.

"ఏమిటా చూపులు? జంతువుని చూసినట్టు. కాఫీ మీకే. గాలికికాదు."

తడబడి బాలరాజు కాఫీ కప్పు చేతికి తీసుకుని సాసర్లో సగం పోసుకుని. కప్పుని ఆమెకి అందివ్వబోయాడు.

"నేను తాగాను."

"తాగిన వాళ్ళకూడా కాఫీ తాగుతారు తీసుకోండి. వాలికిపోతుంది."

ఆమె నవ్వింది. తీసుకుంది. సిప్‌చేసింది. గొంతులో దిగువకి దిగిన కాఫీజాడ కనబడింది. కాఫీ ముగించి అన్నాడు. "చాలా బాగుంది."

"ఏమిటి? కాఫీయేనా?"

"కాదు. కప్పు. మంచి పింగాణీతో తయారు చేసినట్టుంది - నాకు పింగాణీ వస్తువులంటే చాలా యిష్టం. మీకు?"

"స్నానం చేసినా యింకా నిద్రమత్తు పోనట్లుంది."

"నిద్రపోయింది. కాని మత్తు-"

"నేనువెళ్తాను. కాలేజీకి టైమవుతోంది."



"నాదగ్గరికి యిలా పొద్దున్నే రావాలని. నిద్ర లేపాలని."

"బాబాయి పంపించారు. కొత్తముఖం. చిన్నముఖం. అలవాటులేని ముఖం. మేడ మీద వున్నాడు. ఏం కావాలోచూడు. ఎలా వుండాలో చెప్పు- అని. బాబాయికి మీరంటే తగని అభిమానం." ఆమెవెనక్కితిరిగింది. ఓరకంట చిలిపిగా చూసింది.

"రేపూ రండి. నాకు రోజూకొత్తే. అన్నీ మరచిపోతాను - మిమ్మల్ని చూస్తుంటే." చివరిమాట మనస్సులో అనుకున్నాడు. ఆమె గదివిడిచి వెళ్ళిపోతోంది. సుదీర్ఘమైన వేణీద్వయం క్రిందికిదిగి వెనకవైపు అందాన్ని దాస్తోంది. చిలిపిగా మాట్లాడేటప్పుడు తలని స్థిరంగా ఉంచిన ఘనత దానిదేనేమో! అందం మేడదిగింది. తారామతి వెళ్ళగానే బాలరాజు మనస్సు 'చిత్రం!' అనుకుంది. చలాకీతనం, చొఱవ, అనుకోని ప్రవర్తన - అందంలో దాగిన అందాలు - బైటపడితే విచిత్రాలు. విచిత్రం! తన ప్రేమకోరిక యింత త్వరగా ఒకతీరానికి వస్తుందనుకోలేదు.

● ● ●

సాయంత్రం పిట్టగోడమీద బాలరాజు చేతిలో కాలుతున్న సిగరెట్టూ, కంటిముందు దూరంగా క్షితిజం మీద మంచు తెరలాంటి వెలుగూ ముగిసి పోతున్నవేళ తారామతి మేడమీదకు వచ్చింది.

"రండి. మీ గురించే ఆలోచిస్తున్నాను." బాలరాజు అన్నాడు.

ఏమిటి?-అని అతను ఊహించుకొన్నట్టు ఆమె అడగలేదు.




"మీరు సిగరెట్లు కాలుస్తారన్న మాట:"

"ఏం? మీ కిష్టంలేదా?"

"అవును. ఇష్టంలేదు. అవి ఆరోగ్యాన్ని పాడుచేస్తాయి. అయినా ఇంత చిన్నతనం లోనా అలవాటు?."

బాలరాజు మనస్సు చివుక్కుమంది. ఈమె కూడా తన చిన్నతనాన్ని గుర్తు చేస్తోంది. ఎందుకిలా తన చిన్న తనం మీద ప్రతీవ్యక్తి పగతీర్చుకుంటున్నారు? తను వాళ్ళనేం చేశాడూ. అయినా తనేం చిన్నవాడని?



"నేను చిన్నవాణ్నా?" కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగాడు. ఆ ప్రశ్నలో కనిపించని జాలి ధ్వనించింది.

"సిగరెట్లు కాల్చినంత మాత్రాన పెద్ద వాళ్ళయిపోరు." అని కెరటాలకేసి చూసింది. ఆమె కళ్ళు అప్పుడే కడిగిన బెల్జియం అద్దాల్లా మెరుస్తున్నాయి.

"ఏమైనా మీకంటే పెద్దవాణ్నే!" ఆ మాటలో అతని కోరిక స్పష్టమైంది. ఆమె నవ్వింది. విరిగిన కెరటాల వొంపులా బుగ్గలు వొంగాయి. తల విచిత్రంగా తిప్పి. "సరే. మీరు పెద్దవాళ్ళే కాని. సిగరెట్లు కాల్చడం మానేయండి. అవి మంచివి కావు." అంది. ముడుచుకున్న ఆమె పెదాల మరుగులో ఆప్యాయత కనబడింది. ఇన్నాళ్ళయి ఎవ్వరూ తనమీద ఇంతగా శ్రద్ధ చూపలేదు. బాలరాజు చిత్రంగా సంతోష.పడ్డాడు.

సిగరెట్టు ఖర్చయిపోయింది. సముద్రం అంచుమీద వెలుతురు పోయింది. చీకటి పడింది. చలిగాలిలో బాలరాజులో ఆలోచనలు రేగాయి, తనకి ఆలోచనలంటే చాలా యిష్టం. ఏమీ లేకపోయినా వాటి సాయంతో హాయిగా బ్రతగ్గలడు. మనస్సులో వీటి పుట్టుకకి కారణాలు ఆలోచించాడు - సముద్రం. సిగరెట్టు. నవ్వొస్తోంది. సముద్ర తీరంమీద మోజుపడి హైదరాబాదు విడిచి. చదువుకోసం యింతదూరం వచ్చాడు. అక్కణ్నుంచి వచ్చేముందు ఇక్కడ ఇలా ప్రేమ. ప్రేమలో తారామతి యెదురవుతారని తనెప్పుడూ ఊహించలేదు. అంతా యాదృచ్ఛికం. ఎవరో నిర్ణయించినట్టు. కలలో లాగ వుంది.

దీపం వెలుగులో తారామతి చెంపలు మెరుస్తున్నాయి. ముంగురులు చెంపలమీద వ్రాలాయి - నిన్నరాత్రి కలలో తారామతి తన గుండెలమీద వాలినట్టు కనబడింది. ఆమెకేసి చూశాడు. తనొక ముంగురైపోయినా బాగుణ్ను.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అడిగింది.

"ఆలోచన."

పిట్టగోడమీదికి వాలిన ఎదిగిన కొబ్బరిచెట్టు ఆకులు త్రుంపి ముఖంమీదకి కొడుతోంది. బాలరాజుకి పరవశంగా వుంది. క్షణం ఆగి ఆమె మాట్లాడింది.

"మిమ్మల్ని నువ్వు అని పిలిచేదా?"

ఆ ప్రశ్నమళ్ళీ తన చిన్నతనాన్ని గుర్తు చేసింది. బాలరాజుకి కోపం వచ్చింది.

"నేనేం చిన్నవాణ్ని కాను."

"మీరు చిన్నవారని నేననలేదు. ఎందుకలా మీ అంతట మీరు బాధపడడం? మీ కిష్టం లేకపోతే పోనీ లెండి" గోముగా అంది.

బాలరాజు తడబడ్డాడు. అంతలో సామీప్యానికి ఏకవచన ప్రయోగం ఉపకరణేమో అనుకున్నాడు. "ఇష్టం లేకపోవడం కాదు-"

ఆమె కళ్ళు పెద్దవి చేసి చూసింది. తను కళ్ళతో నవ్వాడు.

"బాలరాజూ!"

"తారామతీ!-" అని బాలరాజు పిలుద్దామనుకున్నాడు. కానీ క్రిందనుండి ఆమె బాబాయి పిలిచారు. గుడ్ నైట్ చెప్పి మెట్లు దిగి ఆమె వెళ్ళిపోయింది. 'నామాటలు యింకొకరు ఎందుకు మాట్లాడాలి?' అని నిద్రపోయేముందు అనుకున్నాడు బాలరాజు.

మర్నాడు కూడా ఉదయాన్ని తారామతి కాఫీ యిచ్చింది. మనస్సుకి దగ్గర



పడుతూ మాట్లాడింది. ఈ అలవాటుకి బాలరాజు, తారామతి పదిరోజులలో పాతబడ్డారు.

● ● ●

ఆ ఉదయం మామూలుగా కాఫీ తెచ్చే సరికి తారామతి కంటికి 'మొరేవియా' రాసిన నవల చదువుతున్న బాలరాజు కనిపించాడు. అలా కనిపించిన మరుక్షణం ఆతనిచేతిలో పుస్తకం లాక్కుని మూలకు విసిరికొట్టి అంది. "ఇలాంటి పాడుపుస్తకాలు చదవమని నీ కెవరు చెప్పారు?"

"అది పాడుపుస్తకమని నీ కెవరు చెప్పారు?"

"బుద్ధిలేక నేనే ఒకసారి చదివాను. చదివింతర్వాత తెలిసింది. అది పాడుపుస్తకమని. అసలీ మగాళ్ళెప్పుడూ ఇంతే. సెక్సు తప్ప మరి మంచి విషయాలు మనస్సుకి తట్టవు. ఆ మొరేవియాని యెవరేనా చంపేస్తే బావుణ్ను."

"సెక్సు మంచిది కాదనుకోవడం మన పొరపాటు. సృష్టించడానికి దేవుడికి సిగ్గు లేకపోయింది: అనుభవించడానికి మనుష్యులకి సిగ్గులేక పోయింది. వ్రాయడానికి మొరేవియాకి. చదవడానికి మనకి యెందుకు సిగ్గు?"

"సిగ్గులేకపోతే సరి. ఏమిటా మాటలు? దేనికైనా పరిమితి వుండాలి. ఆ పుస్తకాలంటే అంత పడిచచ్చేవాడివయితే మెళ్ళో కట్టుకు తిరుగు. ఇక్కడెవరూ నిన్ను కాదనరు. ఇక నేను కాదన్నా నీకు లెక్కేముంది గనుక?"

"తారా?" బాలరాజుపిలుపు గుమ్మంలోనే ఆగిపోయింది. ఆమెదిగి వెళ్ళిపోయింది అనుకోని ఈ సంఘటనకి బాలరాజు చకితుడయాడు. తను తారలో కోపం, బాధ చూడలేడు. తనమీద ఆమెకుగల ఆప్యాయతకు అతని మనస్సు రెపరెప లాడింది.

మర్నాడు ఆమె కాఫీతో కనిపించలేదు.

నిజంగా, చాలా పెద్ద కోపం వచ్చిందేమో? ఆ రోజంతా బాలరాజుని ఆమె లేని వెలితి బాధించింది. తను క్రిందకి వెళ్ళి పలకరించలేడు. తనకి చొరవలేదు. ధైర్యం లేదు. ఇన్నాళ్ళయి ఆయింట్లో మనిషయినా అతనికి తారామతి. ఆమె బాబాయి తప్ప మరోమనిషి జాడతెలియదు. అతను సరదాగా. స్వేచ్ఛగా. తృప్తిగా ఆమెతో తప్ప మరొకరితో మాట్లాడ లేడు. కాఫీ తాగినప్పుడల్లా తారామతి గుర్తుకొస్తోంది. తారామతిని తలుచుకున్నప్పుడల్లా కాఫీ గుర్తుకొస్తోంది. బాలరాజు మనస్సు అలా నాలుగు రోజులు పాటు తారామతి లేని తనంతోనూ, తారామతి లేని కాఫీ త్రాగడంతోనూ గిజగిజ లాడిపోయింది. అయిదో రోజు సాయంత్రం, అయిదు రోజుల క్రితం అనుభవాన్ని గుర్తు చేసింది.

అడుగుల ఎప్పుడువిని తలెత్తి చూసిన బాలరాజు కంటి ముందు నవ్వుతూ కాఫీతో తారామతి నిలబడి వుంది. ఆ నవ్వులో జీవం లేదు. చిక్కిపోయి. వాడిపోయి యింటి ముందు వాడి ఎండి పోయిన ఫెరన్ మొక్కలా వుంది. మిగిలిపోయిన వెన్నెల రేకలావుంది.

కాసేపుమౌనంతర్వాత అంది. "కాఫీ:"

"ఇప్పుడే త్రాగాను." అన్నాడు బాలరాజు. ఆమె కాఫీకప్పు టీపాయ్ మీదపెట్టి. టేబులుమీద ఎడంచేతిని ఆనించితలవంచుకు నిలబడింది. కుర్చీలో కూర్చోడానికి కష్టపడుతున్న బాలరాజు పైకి చూశాడు. తారా

మతి కళ్ళల్లో నీళ్ళు సుళ్లు తిరుగుతున్నాయి. అతని గుండెలో వెయ్యి జెట్ ఫైటర్లు వడి వడిగా పరుగెత్తాయి. మొదటిసారిగా ఆమె కళ్ళలో పొర్లిన నీటిని చూసిన బాలరాజు కంగారుగా అడిగాడు.

"ఏడుస్తున్నావా ?"

"అవును."

నిజంగా చిన్నవాడిలా, "ఎందుకు ?" అని అడిగాడు. వేదనమధ్య కనిపించిన సానుభూతికి కన్నీరు పరాకాష్ఠ. ఒక్క నిమిషంలో ఆమె ఆవేదనంతా పెల్లుబికింది.

ఇన్నాళ్ళకి యెల్లాగయితేనేం నీ అంతట నువ్వు కాఫీ తాగేటంత పెద్దవాడివయి పోయావ్ ! నాలుగురోజులు జ్వరంతో వున్నాను - ఒక్కసారైనా నన్ను చూడాలని పించిందీ నీకు ?-ఎందుకనిపిస్తుంది ? అసలు నాగురించి నువ్వెందుకు పట్టించుకుంటావ్ ? నేను నీ కేమవుతాను ?"

"అది కాదు తా-"

"ఏదికాదు ? - నీ అంత నువ్వు వచ్చి నన్ను పలుకరిస్తావని ఈ నాలుగురోజులూ ఎంతగా యెదురుచూశాను ? ఇప్పుడు నీలో యెంత సానుభూతి కోరి వచ్చాను ? నేను కోరింది, ఆశించింది ఏమీ జరుగలేదు. ఈ ఇంట్లో ఎవరెలా పోయినా నాకు బాధలేదు. కాని ఆఖరికి నువ్వు -" దుఃఖంపొర్లింది. ఆమెచేతుల్తో ముఖం కప్పుకోలేదు. ఏడుపులో కూడా ఠీవి. నాటకంలో పాత్రలా బాలరాజు త్వరగా మాటలు పేర్చాడు.

"అలా ఏడవకు. నాకు మాటలు పెగలవు. నీకుకోపం వచ్చిందనుకున్నాను గాని, జ్వరం వచ్చిందనుకోలేదు. నిజంగా యిక్కడ నాకుమాత్రం 'నా' అని చెప్పుకో తగ్గవాళ్ళు యెవ్వరున్నారు ?- నువ్వుతప్ప. ఇప్పుడు నీ ఆసరా లేకపోతే అగాధంలోకి జారిపోతాననిపిస్తుంది. ఇలా చూడు తారా ! నాకేమీ తెలియదు. తప్పుచేశాను. నన్ను క్షమించవూ ?"

"అదుగో. అలా మాట్లాడితేనే నాకు కోపం వస్తుంది. ఎందుకంత పెద్దమాటలు మాట్లాడుతావ్ ? ఆడవాళ్ళని క్షమించమని అడగడానికి మగాడు ఎంతవెనుకాడాలి? నీలో అదేమీలేదు. అసలు నీకు మాటలుకూడా నేర్పాలి. ముందు కాఫీ తాగు"

"ఏం? కాఫీ తాగిం తర్వాత నేర్పుతావా?"

"ఏవిటి?"

"మాటలు."

"నేర్పావులే."

ఇద్దరూ ఒక్కసారిగా సంతోషంగా నవ్వుకున్నారు. బాలరాజు మనస్సు తేలిక పడింది. అతను కదిలాడు. కాఫీ ముగిశాక ఇద్దరూ గదిబైటికి వచ్చి పిట్టగోడ మీద కూర్చున్నారు. రోజూలాగానే చీకటిపడింది. బాలరాజు అనుకున్నాడు - తారామతి నన్ను ప్రేమిస్తోంది. సందేహంలేదు. నేను తారా మతిని ప్రేమిస్తున్నాను. సందేహంలేదు. నాది సందేహం లేని ప్రేమ. ఇంకా ఎందుకీ ఆలస్యం తెర ? మనసు విప్పి చెప్పేస్తే హాయి కనిపిస్తుంది - అని.

"తారా ?"

"ఊఁ."

"నిన్నరాత్రి నాకు కల వచ్చింది - చెప్పేదా ?"

"చెప్పు."



"మళ్ళీ కోపగించుకోనని మాట ఇస్తావా"

"సరేలే. ముందు విసిగించక చెప్పు" ఆమె ఖరీదయిన పౌడరువాసన వేస్తోంది. దగ్గరగా వుంది. అబ్బ ! ఎంత దగ్గరికి !-

"ఏమీలేదు. మనిద్దరం చలిలోసముద్రం మీద పడవ షికారు వెళ్ళామట. చిన్న పడవ. అందులో మనిద్దరమే వున్నాం. ఇంతలో సన్నటి చినుకులతో వర్షం ప్రారంభమయింది. ఇద్దరం తడిసి పో తున్నాం. నేను పడవంతా కలియచూశాను. మూలగా ఒకే ఒక రైన్‌కోటు—అదుగో నీకు కోపం వస్తోంది. చెప్పను."

పూర్తికాని కల విన్నతరువాత అప్రత్యాశితంగా తారామతి ముఖకవళికలు మారాయి. క్షణంలో ఆమె ముఖం ఉదాసీనంగా మారి పోయింది. "ఇక చెప్పొద్దులే రాజూ ! నాకు తెలిసిపోయింది. ఇప్పుడు నీ మనస్సు నాకు బాగా తెలిసిపోయింది" ఆమె ఆగి అంది. "నేను పెద్ద పొరపాటు చేశాను."

అతనిగొంతు వణికింది. "ఏమిటితారా?" అన్నాడు.

"నువ్వు నన్ను ప్రేమిస్తున్నావ్ కదూ?"

"అవునుతారా! - ఈ ఇంట్లో అడుగు పెట్టిన క్షణంనుండీ ప్రతీ క్షణం నిన్ను ప్రేమిస్తూనే వున్నాను. నీ మీద ఆశలు పేర్చుకుంటూనే వున్నాను - తారా! చాలా రోజులుగా నిన్ను అడుగుదామనుకుంటు న్నాను. యింటిముందు మొక్కలమధ్య ఎండి వాడిపోయిన ఫెరన్ మొక్క నాకు కావాలని. ఎందుకో యిప్పుడు ఆ మొక్కని తల్చుకుంటే నువ్వే జ్ఞాపకాని కొస్తున్నావు దానికి నీలాగా ఎప్పుడో జ్వరం వచ్చింది, ఎండిపోయింది. వాడిపోయింది- ఈ నాల్గు రోజులుగా నువ్వు ఎండి వాడి పోయినట్లుగా, ఈ నాల్గు రోజులూ ఏవో మందులు నీ ఆరోగ్యాన్ని బాగు చేశాయి. నిన్ను నిలబెట్టాయి, అయినా వాడిపోయావు. నా కెందుకో ఆ ఫెరన్ మొక్కనీ, నిన్నూ దక్కించుకోవాలని నాదిగా చేసుకోవాలని అనిపిస్తుంది. నువ్వు నన్ను కోరితే, ప్రేమిస్తే - ఆ మొక్కపువ్వులుపూసినట్టుగా-"

"ఫెరన్‌మొక్కలుపువ్వులు పూయవు-"

బాలరాజు మనస్సు స్తంభించింది

"నిజమా?"

"నిజం రాజు! యిదివరకెన్నడూ పూయలేదు కూడా. - నేనూ అంతే"

"అంటే?" అతనికళ్ళు సమాధానంకోసం ఆమె ముఖాన్ని వెతుకుతున్నాయి, మనస్సు చూస్తోంది. ఇంద్రియాలు ఒకదానిపనిని మరొకటి చేస్తున్నాయి.

"అవును. ఇన్నాళ్లూ నిన్ను ఆ దృష్టితో నే నెప్పుడూ చూడలేదు. నిన్ను కేవలం ఒక తమ్ముడిగా చూశాను. ప్రపంచం అంటే ఏమీ తెలియని వాడిలాగ, పసివాడిలాగ చేతుల్లో పెరిగినట్లు కనిపిస్తావు రాజూ. ఎందుకలా నామీద ఆశలు పెంచుకున్నావ్? ఎందుకు నన్ను ప్రేమించావ్ ? ఎందుకింత పొరబాటు చేశావు !"

"తారా ! అలా అనకు. నాకు పిచ్చెత్తుతుందేమోనని భయంగా వుంది. నా ఆలోచనలు చచ్చిపోతాయి. ఇన్నాళ్ళూ నా ఆలోచనలమీదే ఆశతో బ్రతుకుతున్నాను. అవి త్వరలో అనుభవాలవుతాయని నా ఆశ. చూడు తారా: నాకు కావలసింది నీ సామీప్యం. నీ మనస్సుదగ్గర చోటు.అంతే.

నాబాధనీ నన్నూ అర్థంచేసుకో. నిన్ను చూసింది మొదలు నాలో ప్రతిశక్తీ నశించి పోయింది. తుదకు ప్రేమ మిగిలింది. అది నాకు లేకుండా చెయ్యకు తారా!"

ఆమె దూరంగా చీకటిలోకి చూస్తూ అంది. "నాకిప్పుడు నవ్వాలో ఏడవాలో తెలియడం లేదు. నిన్ను తమ్ముడిగా నాలో ఊహించుకుని నీమీద ప్రేమని ఎలా మలుచుకోమంటావు చెప్పు." ఆమె ఏడుస్తోంది.

అతనూ ఏడుస్తున్నట్టు ముఖం పెట్టాడు.

"నాలో ఆడది కోరే అధిక్యత లేదనేగా నీ వుద్దేశ్యం? తారా! ఏమీ వ్రాయని తెల్ల కాగితాల పుస్తకం నీకు దొరికింది. నీవ్రాతని బట్టేగా దాని అర్హతలు నిర్ణయమయేది. నా గుండెల్లో బాధ నీకు తెలుసు. నేను నీకు తెలుసు. నా కోసం ఆలోచించలేవూ?"

ఆమె లేచింది. "ఎలా ఆలోచించాలో తెలియడంలేదు. మంచి ఆలోచనలు లేకే ఈ నాలుగు రోజులూ చిక్కిపోయానా అనిపిస్తోంది-నీకేంతక్కువ రాజూ? నాకంటే అందమైన వాళ్ళెందరో జీవితమంతా నీతో కలిసి బ్రతకడానికి సిద్ధపడతారు."

"నేను మాత్రం అలా సిద్ధపడలేను. నీలో చూసిన అందాన్ని వాళ్ళల్లో చూడలేను. నాకిప్పుడు కావలసింది కోరికతీరడం కాదు తారా! నీతో కలిసి బ్రతకడం. నీ మనస్సు పంచుకోవడం-ఒక్క మాటలో 'నువ్వు'."


"ఇక నీతో మాట్లాడలేను. ఎటూ ఆలోచించుకోలేకపోతున్నాను. వస్తాను" అని చెప్పి తారామతి వెళ్ళిపోయింది. బాలరాజుకి పిలవాలనిపించలేదు. అతను హతాశుడై పోయాడు. మంచి జ్ఞాపకం స్మృతిని వీడినట్టు వెళ్ళిపోయింది తార. అతని మనస్సులో కోరికలు ఎండి తగులబడి పోతున్నాయి. మనస్సులో రూపం తయారుచేసిన వయస్సుని నిందించుకున్నాడు. ప్రేమలో ఎంత బలంవుందో అతనారోజు తెలుసుకున్నాడు.

ఆరాత్రి నిద్రపట్టక దేవుణ్ణి సంబోధిస్తూ యిలా వాపోయాడు:

"ఓ దేవుడా! హే భగవాన్! - నాకిప్పుడు నిజంగా ఇరవైయేళ్ళు. నామనస్సుకి పాతికేళ్ళు. నా పాడుముఖానికి పదహారేళ్ళు. నాకింత 'పెద్దమనస్సు' ఇంత పసిరూపం ఎందుకిచ్చావ్ దేవా? ఇంతపెద్ద మనస్సుతో యింత చిన్నవాడిగా ఎలా బ్రతగ్గలనను కున్నావ్ దేవదేవా! అన్నీ తెలిసి నన్నెందుకిలా ఏడిపిస్తావ్ భగవంతుడా! మగాడికి ఆడదితియ్యటి కల అనీ, ఆడదానికి మగాడు తియ్యటి అనుభవమని నీకుమాత్రం తెలియదా పరాత్పరా! నా ఖర్మ కాకపోతే నేను తారామతి మేడమీదే ఎందుకు దిగాలి? నా ఖర్మకాకపోతే తారామతి రోజూ నాకు కాఫీ తెచ్చి ఎందుకివ్వాలి? నాతో ఎందుకంత చనువుగా మసలాలి? నా మహాఖర్మ కాకపోతే నన్ను తారామతి తమ్ముడిగా ఎందుకు భావించాలి?— తార ఎంతబాగా నవ్వుతుందని! నీకు తెలియదు లోకరక్షకా! తారనవ్వులో నిన్నుకూడామరచిపోతాను. ఓ దీనబాంధవా! నాబాధ నీకు తెలుసు. నా క్కావలిసింది - సెక్సు కాదు, ప్రేమ. నాకున్నదివాంఛకాదు, ప్రేమ. ఇప్పుడు సెక్సు బజార్లో ఖరీదుకి దొరుకుతోంది. ప్రేమ అలా దొరికేది కాదు. దానికి ఖరీదులేదు. దానికి నిర్వచనం కూడాలేదు. అది అమూల్యము. కాబట్టి ఓ దీనదయాళూ! నన్ను త్వరగా పెద్దవాణ్ణి చేసి, నా యీ చిన్నతనపు బాధని పోగొట్టవూ!-నా తార నన్ను ప్రేమించాలని శాసించవూ!-" అంటూ ఈ విధంగా ప్రతి వాక్యంలో, ప్రేమనీ, దేవుణ్ణి, తారామతినీ, తన మతినీ రంగరించి మరీ వాపోయాడు, విలపించాడు-వేడుకున్నాడు-పదహారేళ్ళ రూపం, ఇరవైయేళ్ళ వయస్సు పాతికేళ్ళ మనస్సూగల ప్రేమపక్షి బాలరాజు.

• • •

తెల్లారాక తారామతికి బాబాయి చెప్పినప్పుడు తెలిసింది-కారణం చెప్పకుండా బాలరాజు మేడగది వదిలి వెళ్ళిపోయాడని. ఆమె అదిరిపడింది వెంటనే. త్వరత్వరగా మేడ ఎక్కి అతని గదికి వెళ్ళింది. ఖాళీగా వెలితిగావుంది. తారామతికి మతిపోయింది. ఎందుకిలా హఠాత్తుగా తనకు తెలియబరచకుండా వెళ్ళిపోయినట్టు? ఎక్కడికి వెళ్ళిపోయినట్లు?- తను లేకపోయిం తర్వాత ఈ ఇంట్లో అతనికి ఏమీ లేదని నిర్ధారణ కొచ్చాడా?-క్షణంసేపు విపరీతంగా భయపడింది తారామతి. మనస్సులో ఆలోచనలు సాగలేదు. చుట్టూ కలయజూసింది. ఎదురుగా టేబులుమీద బాలరాజు డైరీ. సందేహంలేదు. అది తనకోసమే వదిలివెళ్లాడు. తను చూడాలని. చేతిలోకి తీసుకుంది. అట్టమీద పందొమ్మిది పక్కన అరవైనాలుగు పెన్నుతో కొట్టేసి డెబ్భై అంకెవేసి వుంది. కొత్త డైరీ. దాదాపు పేజీలన్నీ ఖాళీగా వున్నాయి. పైకి చెప్పలేని మూగబాధని మధ్య పేజీల్లో పొందికగా వ్రాశాడు బాలరాజు.



—పదేళ్ల ప్రవాసంలో గడిపి వెలుగుని చూసినట్టయింది నాకు తార కనిపించాక. ఇన్నాళ్ళూ ఆలోచనలకి అలవాటు పడిన మనస్సు అనుభవాలకి అలవాటు పడుతుంది అనుకున్నాను. ఫలితంగా నిరాశ నిలిచింది. అన్నీ పోయాయి ఇప్పుడు మనస్సుకి తోడు నిలిచేందుకు ఏమీలేదు. ఆలోచిస్తే బ్రతుకులో భయపెట్టే ఒంటరితనం వుంది. పాలుపోసి ఆప్యాయంగా పెంచిన నా రూపం నాకు ద్రోహం చేసింది. రూపాన్ని నమ్మకూడదు. దానికి కృతజ్ఞత లేదు.

—ఎంత ప్రయత్నించినా ఈ ప్రేమ నన్ను వదలట్లేదు. చేసుకున్న పాపం లాగ, తార రూపంలాగ. నిజంగా తారని పొందడానికి నేనే తగిన వాణ్ణి. ఆమెను నేను అర్థం చేసుకున్నాను. అర్థం చేసుకున్న వాళ్ళే అనుభవానికి అర్హులు.

—ప్రేమంటే ఏమీలేదు. ఆత్మ విశ్వాసాన్ని, తృప్తినీ, గర్వాన్నీ, నిండుతనాన్నీ సంపాదించుకోవడానికి యవ్వనం ఆడే ఆట. ఉత్త షోకేస్. ఇద్దరు కలిసి బ్రతకాలనుకునే బలహీనత, నరాల పటుత్వం సన్నగిల్లినప్పటి వింతవ్యాధి.

—రోజూ యింటి పక్కనుంచి వెళ్ళినప్పుడల్లా ఓ కుంటి కుక్కపిల్ల నావేపు జాలిగా, సఖ్యతగా చూస్తూవుంటుంది. నిన్న దానివేపు చూస్తూ నడుస్తూవుంటే రాయి తన్నుకొని కాలి రక్తం బొటబొటా కారింది. ఆ కుక్క అరుస్తూ, గిలగిలా కొట్టుకుంటూ నా కాలుచుట్టూ తిరుగుతూ, నాలికతో గాయాన్ని నాకుతానంటుంది. హఠాత్తుగా నాకో విషయం అర్థమయిపోయింది. అదే అదే! ప్రేమ - అయ్యో! కుక్కలకి పెట్టినంత్నుంచి ప్రేమని మానవుడికి యివ్వలేదే!-

—కలలో దేవుడు కనిపించాడు. తుమ్మెదలనారి. చివురు, బాణము-వాడే-మన్మథ!- ఏంకావాలి?-అన్నాడు. 'నువ్వు మాత్రం వద్దు' అన్నాను. ప్రేమ లేకపోతే బ్రతగ్గలవా?-అన్నాడు. అదొక్కటే లేకపోతే ఆరోగ్యంగా ఉంటానన్నాను. నన్ను క్షమించి వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయాక తార జ్ఞాపకానికి వచ్చింది. హా! తెలిసెను. బ్రతకలేను. మన్మథుణ్ణి ప్రేమ చంపేసింది.

—ఉన్నట్టుండి పెద్ద పక్షినయిపోయాను రెక్కల్ని టపటప లాడిస్తూ ఎగురుతున్నాను. కొంతసేపు ఎగిరాక తీరా చూస్తే రెక్కలు లేవని తెలిసింది. తెలిశాక పడిపోతానేమోనని భయమేసింది. భయమేశాక దబ్బున పడిపోయాను. ఆలోచిస్తే తేలిందియిది. నేను ప్రేమ పక్షినయాను. రెక్కలు నా కోరికలు. లేవని గుర్తించడం చిన్నవాడనయిపోవడం. క్రింద దబ్బున పడడం నా ప్రేమ జీవితం కూలిపోవడం.

—నిజానికి నాకేం తక్కువ?- ఎందుకో ఎన్నియుగాలు గడిచినా మగాడిలో నిర్లక్ష్యాన్నే ప్రేమిస్తానంటుంది ఆడది. ఇక క్షణంకూడా యిక్కడ వుండాలనిపించడం లేదు. దూరంగాపోయి ఒంటరి తనంలో తారని చూసుకుంటూ బ్రతకాలని వుంది. మధ్యాహ్నం మెయిలులో వెళ్ళిపోతాను.

డైరీ చదివిన తారామతి చలించిపోయింది స్త్రీలో ఆర్ద్రతకి మల్లే మగాడిలో దైన్యత కూడా మనస్సుని కదుపుతుంది. ఆమె అలాగే నిలబడి పోయింది.

● ● ●

[illegible] [illegible]డాయి. చాల విష[illegible]. సంఘటనలు పాతబడిపోయాయి. [illegible] [illegible] ప్లాట్ఫారం ఎందుకో వెలిగా వుంది. రైలుకోసం ఎదురుచూస్తున్న తారామతి అనుభవాల పుట్టలాగ వుంది. పక్కన భర్త పేపరు చదువుకుంటున్నాడు - నుదుటిమీద గీతలు స్ఫుటంగా కనిపిస్తున్నాయి. సంసారానికి సాక్ష్యాల్లా మిగిలిన ఇద్దరు పిల్లలూ, బెంచీమీద ఆడుకుంటున్నారు. తారామతిదిక్కులుచూస్తోంది. [illegible]ప్పుడు యాంత్రిక జీవితానికి అలవాటు పడిపోయింది. బ్రతుకులో అనుభూతులేవీ యిప్పుడు మనస్సు దరికి చేరట్లేదు.

ఉన్నట్టుండి ఆమె చూపులు ఒక్కక్షణం వెయిటింగ్ రూమ్ గుమ్మంలో నిలబడి సిగరెట్ కాలుస్తూన్న వ్యక్తిమీద నిలిచాయి. అవును-అతనే.

బాలరాజు కళ్ళు మునుపటికంటె చురుగ్గా చూస్తున్నాయి. పెదాలు - ఎంత దాగుంటాయి. సిగరెట్లు కాల్చినా ఎంచేతనో వాడిపోలేదు. ఇంకా నవ్వుతున్నాయి. ముఖంలో లేతదనం చెరిగి పట్టుదల సిద్ధమౌతోంది. పదహారేళ్ళవాడిలా కనిపించిన బాలరాజు ఎంతగా ఎదిగిపోయాడు. ఇప్పుడు పాతికేళ్ళుంటాయి. నిండుగా, ఠీవిగా, స్ఫుటంగా-గొప్ప ప్రేమకి సిద్ధపడుతునట్టు. బాలరాజు బావున్నాడు. ఆ రోజు ఎందుకలా వెళ్ళిపోయాడు! మళ్ళీ ఆ రోజులు స్మృతిలోకి వస్తున్నాయి. గతం మనస్సుని కదిపి బాధాస్థిరత్వాన్ని జ్ఞాపకం చేస్తోంది. అప్పుడు తను ఎంత సుఖంగా వుండేది! బాలరాజు సరసన మాటల్లో-మళ్ళీ యిన్నాళ్ళకి సుఖం గురించి ఆలోచన! నవ్వొస్తోంది. అప్పట్లో బాలరాజుని మన్నించి పెళ్ళిచేసుకొనివుంటే ఎలా వుండేదో! ఛా! ఈ ఆలోచన కూడదు. తనకి పెళ్ళయిపోయింది. తన గతం చీకటిలో మిగిలిపోయింది. అతని జీవితంతో తనకేం సంబంధం? అయినా ఎందుకో మనస్సు సమాధాన పడటంలేదు.

సిగరెట్టు పారేశాడు.

ఎటో చూస్తున్నాడు. ఆ చూపులు ప్రపంచాన్నంతా క్షమించ గలవు. ఒకప్పుడు అవే చూపులు తన క్షమకోసం ప్రాకులాడాయి. అప్పట్లో తనకి క్షమించడం చేతకాలేదు. ఇప్పుడు చేతనయీ తను క్షమించలేదు. జీవితంలో తప్పటడుగు వేశానేమోనని పిస్తోంది. ఇప్పుడు బాలరాజు ప్రతిపని చూస్తుంటే మనస్సులో బాధ వరదై ప్రవహిస్తోంది. దాటిపోయిన రైలులాగ తన జీవితం ముందుకు లంఘించింది. ఇన్నేళ్ళ జీవితంలో నిజంగా, తన మనస్సుకి దగ్గరపడ్డ వ్యక్తి ఇంకెవ్వరున్నారు - ఒక్క బాలరాజు తప్ప. ఆ రోజు బాధపడి వెళ్ళిపోయిన బాలరాజు యింకా బాధ పడుతూనే వున్నాడా? ఇంకా తన్ను గురించి ఆలోచిస్తున్నాడా? అంత మంచి అందాన్ని తన ఆలోచనల్లో వృథా చేస్తున్నాడా? చేయకూడదు. అలా చేస్తే తను సహించలేదు. భరించలేదు. అతనికి పెళ్ళయి వుంటే బాగున్ను - తన మనస్సుక ఊరట. అదిగేదా? అవును. మాట్లాడాలనిపిస్తోంది. ఇంకా అక్కడే నిలబడి వున్నాడు.

ఆమె వడివడిగా నడిచి అతన్ని సమీపించింది. "రాజూ!"

ఆ పిలుపు ఐదేళ్ళ పాతది. అయిదేళ్ళ క్రితం ఆప్యాయత కంటె ఆప్యాయంగా వుంది. అతను చూశాడు. విస్మితుడయ్యాడు. "తారా !"

ఆమె వణికింది. ఎంతచక్కగా పిలిచాడు. మాటలో భావంలో కొత్తనిండుదనం కౌగిలించు కోవాలని పిస్తోంది. నుదుటిమీద పడే జుట్టు తొలగించి నుదురు చూడాలని పిస్తోంది. ముచ్చటగా - చిన్న నుదురు.

"పెళ్ళి చేసుకున్నావా?" అదే తన మొదటి ప్రశ్న.

"లేదు. ఆరోజునుంచి అలాగే వుండిపోయాను. నీ గురించే ఆలోచన. అప్పుడప్పుడు పిచ్చివాణ్ణయ్యానేమోనని అనుమానం. అయినా బ్రతుకులో నిలబడగలిగాను. ఇప్పుడు నాకు దాగా లొ ం గి పో యింది బ్రతుకు. దేవుడు నా మనస్సు పాడు చేశాడనుకుంటాను ఎప్పుడూ. అలా అనుకుంటూనే ప్రతిక్షణం నీ గురించి ఆలోచించాను. కాని నువ్వు దక్కలేదు. మరొకర్ని పెళ్ళిచేసుకున్నావు. ఇల్లాలివైపోయావు. దూరమైపోయావు."

"మమ్మల్ని చూ శా వా యిప్పుడు?"

"అవును. అరగంట క్రితం నిన్నూ. ఆయన్నూ. పి ల్ల ల్నీ కూ డా చూశాను. ఇప్పుడు నిజంగా నాకంటె పెద్దదానివిలా కనబడుతున్నావ్. కులాసాగావున్నావా?"

"ఏం కులాసా? అంతా యాంత్రికంగా వుంది. అ ప్పు డు నువ్వు వెళ్ళిపోయిన కొద్దిరోజుల్లోనే పెళ్ళయింది. అప్పట్నుంచీ సుఖమంటే ఏమిటో మరచిపోయాను."

"అవును. వి వా హం వ ల్ల మగాడు స్వేచ్ఛనీ, ఆడది సుఖాన్నీ నష్టపోతారు."

"చాలాపెద్దమాటలు మాట్లాడుతున్నావు. పెరిగిపోయావు."

"పోనీలే - యిప్పుడు చిన్న వాణ్ణనే బాధలేదు. ఇన్నాళ్ళకయినా నా పెద్దతనాన్ని గుర్తించావ్ - కాని చాల ఆ ల స్యం గా గుర్తించావనే నా బాధ"

అవన్నీ పాతరోజులు. దయచేసి మరచిపోదామనుకున్నా. అవి నన్ను మరచి పోవట్లేదు. అందుకే నా ఆలోచనలు పెరగకుండా అలాగే వుండిపోయాయి. చివరికి పెరిగింది మనస్సూ. నేనూ. అంతే."

తారామతికి మనస్సు వికలమై పోయింది. మంచు శిఖరం కూలి మీదపడి నట్లయింది. బాలరాజు తన మూలంగానే పెళ్ళి చేసుకోకుండా వుండిపోయాడు! అతని వొంటరితనానికి తనే కారణమా! తనే అయితే ఎంత పొరపాటు చేసింది. అతని బ్ర తు కు ని ఎంతగా పాడుచేసింది. ఎందుకలా చేసింది. అతనిలో అసమగ్రత ఏం కనిపించిందని?- ఉరుములనడుమ, మెరుపులనడుమ నిలబడి మేఘాలనుండి పడే నీటికోసమే ఎన్ని యుగాలైనా ఆశతో ఎదురు చూస్తుంది కాని మరోనీటిని కోరదుట చాతకపక్షి. చూడగా బాలరాజూ అంతే ననిపిస్తూంది.

ఏమిటో మాట్లాడు తున్నాడు - ఫెరన్ ముక్కు అలాగే వుందా? బాదాయి దావున్నారా?-' తనకేమీ వినిపించడం లేదు. పిచ్చి బాలరాజు అనుకోబోయింది. ఇంతలో రైలు వేగాన్ని చంపుకుంటూ స్టే ష న్లో కి వచ్చేసింది.

● ● ●

డైరీ పట్టుకొని అలాగే నిలబడిపోయిన తారామతి కొన్ని క్షణాలపాటు ఈ విధంగా కలగంది. తర్వాత-అమ్మో!- యిది నిజమైతే యింకేమన్నా వుందా? ఇక ఆలస్యం చెయ్యకూడదు. బాలరాజుని వదిలి తను దూరంగా వుండలేదు. వెళ్ళాలి. త్వరగా స్టేషన్‌కివెళ్ళి బాలరాజుని అపాలి అనుకుని కంగారుగా తొ ట్రు పా టు తో మేడదిగి కారెక్కి స్టేషన్‌కి బయలుదేరింది. మధ్యలో ఎందుకో దుఃఖం వచ్చింది. దారిపొడుగునా అనేక ఆలోచనలు విచిత్రంగా ఆమెలో చెలరేగాయి.

తారామతి తడబడుతూ స్టేషన్లోకి అడుగుపెట్టేసరికి, రైలు ప్లాట్‌ఫారం వదిలింది. ప్రయత్నానికి లొంగని అ సం క ల్పి త లక్ష్యంలా.

గుండె పగిలింది, హతాశయై వెనక్కి తిరిగింది.


చేతిలో సూట్‌కేసుతో బాలరాజు వేగంగా నడుస్తున్నాడు. తన్ను చూసి తడపడ్డాడు. ఆమె అడిగింది తేరుకుని. "నువ్వు వెళ్ళిపోయావనుకున్నాను."

"వెళ్ళిపొయేవాణ్నే. కాని రిజర్వేషన్ లేదన్నారు. సాయంత్రం త ప్ప క వెళ్ళిపోతాను" అతను తిరిగాడు.

"రాజూ !"

"ఎందుకు?" అటువైపు తిరిగి ముక్తసరిగా తలవంచుకునే అ డి గా డు. ఆమె అతని బుజంమీద చెయ్యివేసింది. "ఇంటికి పోదాం రావూ !" ఆ పిలుపులో లాలింపు. వేడికోలు. అతని మనస్సుకోరన ఉత్కర్ష ధ్వనించాయి.

"ఎందుకు? అక్కడ నా కిం కా ఏం మిగిలిందని?"




"నేను."

అతను తలతిప్పి విచిత్రంగా చూశాడు. అతని నరాల కదలికలో ఆకస్మిక చైతన్యం ప్రవేశించింది.

"రాజూ ! నిన్ను.....................నిజం !" ఆమె తడి పెదాలు చిత్రంగా కదిలాయి.

"తారా !" ఆ మె కు భయంవేసింది. స్టే ష ను లో కౌగలించుకుంటాడేమోనని. అతను మొదట్నుంచీ అంతే. క ం గా రు మనిషి. ఏ భావాన్నీ దాచుకోలేదు.

తారామతి ముందుకు కదిలింది బాలరాజు ఆమెను అనుసరిస్తూ-తల్చుకుంటే పురుషుడికంటే స్త్రీయే సెంటిమెంట్లనితెంపుకోగలదు. తనకు కావలసినవిధంగా మలుచుకోగలదు- అని నిర్వచించుకున్నాడు.

బాలరాజుకి యి ప్పు డు చలిరహస్యం తెలిసిపోయింది. □□□